# ప్రజాశక్తి

ఆదివారం 15 జూన్ 2025

8 పేజీలు







విశాఖపట్నం అనకాపల్లి


# సత్వ ఐటికి 25 ఎకరాలు !



రుషికొండ ఐటి సెజ్ ఏరియల్ వ్యూ (ఫైల్ ఫొటో)

- రంగం సిద్ధం చేసిన కూటమి సర్కారు
- విస్తృతంగా భూ కేటాయింపులు.. ఉద్యోగాలు అంతంత మాత్రం
- పదేళ్లుగా 27 వేలు దాటని విశాఖ ఐటి ఎంప్లాయిమెంట్

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

దేశంలో బెంగళూరు ప్రధాన కార్యాలయంగా నడుస్తున్న 'సత్వ' ఐటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజిమెంట్ డెవలపర్‌కు రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ రుషికొండ హిల్ నెంబర్ 4పై 25 ఎకరాలను సమర్పించేందుకు రంగం సిద్ధం చేసినట్లు స్పష్టమవుతోంది. దేశంలో టాప్ 5 ఐటి కంపెనీల్లో ఒకటిగా సత్వ ఉంది. సదరు సంస్థకు కేటాయింపులపై త్వరలో చంద్రబాబు నిర్ణయం చేయనున్నట్లు తెలుస్తోంది. సదరు కంపెనీ ఐటి పార్కులను అభివృద్ధి చేసేందుకు ఈ 25 ఎకరాలను వినియోగించనుందని ఐటికి చెందిన ప్రతినిధులు చెబుతున్నారు. సుమారు రూ.2500 కోట్ల మేర పెట్టుబడులు పెట్టి ఐటి పార్కులు, భవనాలను నిర్మించేందుకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్)ను సత్వ సంస్థ ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్టు పలువురు చెబుతున్నారు. రాగల మూడు నెలల్లో సత్వ తన కార్యకలాపాలను విశాఖ నుంచి ప్రారంభించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఇన్ఫోసిస్ సంస్థకు హిల్ నెంబర్ 2లో భూమి ఇచ్చే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది.

**గతంలో భూ కేటాయింపులు ఇలా..**

రుషికొండ హిల్ నెంబర్ 3లో టిసిఎస్‌కు ఎకరాకు 90 పైసలు చొప్పున 21 ఎకరాలు, ఆ పక్కనే ఉర్సా కంపెనీకి 3.5 ఎకరాలు, కాపులుప్పాడలో మరో 56.36 ఎకరాలను కొద్ది రోజుల క్రితమే రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కేటాయింపులు చేసి విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. అంతకు ముందు 2014-2019 మధ్య కాలంలో మధురవాడలో 132 ఎకరాలను ఐటి డేటా సెంటర్ కోసం అదానీకి చంద్రబాబు ప్రభుత్వమే భూమి ఇచ్చింది. ఇంతవరకూ ఆ సంస్థ మిగతా 2లో..



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ

# గ్రంథాలయాలను కాపాడుకోవాలి

**విజ్ఞానం, మానవ పురోగతి వాటితోనే సాధ్యం**

**'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దశ, దిశ - ప్రజల కర్తవ్యం' చర్చాగోష్టిలో వక్తలు**

**ప్రజాశక్తి - సీతమ్మధార :** గ్రంథాలయాలతో సమాజం చైతన్యవంత మవుతుందని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యాన శనివారం విశాఖ పౌర గ్రంథాలయంలో మేదో మథనం పేరిట 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయాల దశ, దిశ - ప్రజల కర్తవ్యం' అన్న అంశంపై చర్చాగోష్టి జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ద్రవిడ విశ్వ విద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ కెఎస్.చలం మాట్లాడుతూ గ్రంథాలయాలతో జ్ఞానం, విజ్ఞానం చేకూరుతాయన్నారు. పుస్తకాల వల్లే తాము ఈ స్థాయికి వచ్చామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలుగులో పుస్తక ముద్రణలు తగ్గిపోయాయన్నారు. గ్రంథాలయోద్యమానికి ప్రజలను సమాయత్తం చేయవలసిన అవసరముందన్నారు. గ్రంథాలయాల అభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. గ్రంథాల యాలు ప్రస్తుతం ప్రభుత్వ ఆదరణ లేక దీనావస్థలో ఉన్నాయన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ విసి హెచ్.లజపతిరాయ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు గ్రంథాలయాలను అలవాటు చేయాలన్నారు. దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ మిగతా 2లో..

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నేవల్ వైద్యుల దుర్మరణం

వార్త 3లో..

## స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపేస్తున్నట్టు ప్రధాని ప్రకటించాలి

వార్త 4లో..

## వినియోగదారులకు విద్యుత్ బిల్లుల షాక్

వార్త 4లో..




రక్తదాతను అభినందిస్తూ జ్ఞాపిక అందజేస్తున్న అతిథులు

# స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రక్తదానం

సిఐటియు కృషిని మెచ్చుకున్న అతిథులు వార్త మెయిన్‌లో..

## 16న విశాఖలో సిఎం పర్యటన

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖలో పర్యటించనున్నారు. తన పర్యటనలో భాగంగా ఆ రోజు ఉదయం 10 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరి 10:40 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10:50 గంటలకు బయలుదేరి 11:10 గంటలకు బీచ్ రోడ్డులోని కాళీమాత టెంపుల్ ప్రాంతానికి చేరుకుని 11:15 గంటల నుంచి 11:40 గంటల వరకు యోగాంధ్ర ప్రధాన వేదికైన కాళీమాత టెంపుల్ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తారు. 11:40 గంటలకు పార్క్ హోటల్ నుంచి బయలుదేరి 11:45 గంటలకు ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 11:45 నుంచి 12:05 గంటల వరకు ఎయు ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన వేదికను పరిశీలిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:05కు ఆంధ్ర యూనివర్సిటీ నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి 12:15 గంటలకు బీచ్ రోడ్డులోని నోవాటల్ హోటల్‌కు మిగతా 2లో..

# నీట్ ఫలితాల్లో విజయకేతనం

**విశాఖ విద్యార్థులకు మెరుగైన ర్యాంకులు**

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** శనివారం విడుదలైన నీట్ - 2025 ఫలితాల్లో విశాఖ విద్యార్థులు మెరిశారు. నగరంలోని ఎసెంట్ సంస్థకు చెందిన విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ముప్పారపు తులసి భార్గవ రామ్ జాతీయ స్థాయిలో రిజర్వుడ్ కేటగిరీలో 55వ ర్యాంకు, ఓపెన్ కేటగిరీలో 211వ ర్యాంకు సాధించాడు. ఆ కళాశాల విద్యార్థులు వరుసుగా 402, 905, 1582, 1742, 1782, 2171, 2190, 2742, 2956 వంటి ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి ఉత్తమ ఫలితాలు పొందారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎంవిఆర్.మురళీకృష్ణ మాట్లాడుతూ మొట్టమొదటి బ్యాచ్‌లోనే ఎక్కువ ర్యాంకులు సాధించగలిగామన్నారు. ఒకే ఒక క్యాంపస్ నుండి నీట్ 2025లో 100 మంది సీట్లు సాధించారని తెలిపారు. దీని వెనక ఉన్న తమ డైరెక్టర్‌లను, అధ్యాపక అధ్యాపకేతర బృందాన్ని, వారి పట్టుదల, కృషిని ఆయన అభినందించారు.



55వ ర్యాంకు సాధించిన తులసీ భార్గవ్ రామ్‌కు అభినందన

జిల్లాలోని శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తరాంధ్రలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ కేటగిరీలకు చెందిన జి.గురు చరణ్ 207, జామ గిరిజ 425, డి.అజయ్ మిగతా 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### సత్వ ఐటికి 25 ఎకరాలు !

కార్యకలాపాలు చేపట్టలేదు.

**ఐటిలో ఉపాధి ఎంత పెరిగింది ?**

విశాఖ ఐటి రంగంలో ఆయా సంస్థల్లో ఉపాధి అవకాశాలు 2015 నుంచి ఇప్పటివరకూ పెద్దగా పెరిగిందేమీ లేదనే చెప్పాలి. మొత్తంగా ఇప్పటివరకూ 27 వేలు దాటలేదు. 10-15 ఏళ్ల క్రితమూ ఇదే లెక్క. కాగా విశాఖలోని ఐటి సంస్థలైన డబ్ల్యూఎన్ఎస్‌లో 5 వేల మంది ఐటి ఉద్యోగులు, ఇన్ఫోసిస్‌లో 1500, కాండ్యుయెంట్‌లో 1000, టెక్ మహీంద్రాలో 1500, పాత్రాలో 3000, విప్రోలో 100 మాత్రమే ఉద్యోగులు ఉన్నారు. పై వాటిలో ఇన్ఫోసిస్‌లో మాత్రమే 1500 కొత్త సంఖ్యగా చెప్పొచ్చు. ఏటా విశాఖ నుంచి ఐటి లేదా ఇతర సాంకేతిక విద్య పట్టాలతో 10 వేల మంది బయటకు వస్తున్నారు. వీరంతా వేర్వేరు పనులను వెతుక్కుంటూ బయటకు వెళ్లడమో, చిన్న పాటి ఉపాధి అవకాశాలను వెతుక్కునే పనిలో నిమగ్నమవడమో జరుగుతూ వస్తోంది. 2024లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విశాఖకు ఐటిలో పెద్ద పీట వేస్తామని, ఎపిని అంతర్జాతీయ ఐటి హబ్‌గా మార్చే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ప్రకటించిన విషయం తెలిసిందే. గడిచిన ఏడాది కాలంలో వారు ఉపాధి కల్పనపై చేసిందేమీ లేదనే చెప్పాలి. విశాఖలో ఐటికి అపారమైన అవకాశాలున్నా అందుకు తగ్గట్టుగా ఉపాధి దొరకడం లేదు. గతంలోని ఐటి ఉద్యోగుల లెక్కలే ఇప్పటికీ చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

**రుషికొండ మిలీనియం టవర్స్‌లో పరిస్థితి ఇదీ..**

హిల్ నెంబర్ 3లోగల మిలీనియం టవర్స్‌లో సుమారు రెండు లక్షల స్క్వేర్ ఫీట్ ఖాళీ స్పేస్ ఉంది. గతంలో ఐటి సెజ్‌లో ఉన్న మిలీనియం టవర్స్‌ను డీనోటిఫై చేసింది ప్రభుత్వం. దీన్ని టిసిఎస్ సంస్థ వాడుకునేలా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చర్యలు ప్రారంభించింది. టిసిఎస్ సంస్థ ఇంటీరియర్స్‌ను అభివృద్ధి చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధులు ఇటీవలే ఇక్కడకు వచ్చి వెళ్లారని ఐటి రంగ విశాఖ ప్రతినిధులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. టిసిఎస్‌లో 2 వేల కొత్త ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయి. సత్వ రంగ ప్రవేశం చేస్తే కొత్త ఐటి పార్కులు రావొచ్చని కూడా చెబుతున్నారు.

### గ్రంథాలయాలను కాపాడుకోవాలి

ఫౌండర్ వైస్ ఛాన్సలర్ ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయ నిర్వహణ పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ మాజీ విసి రొక్కం సుదర్శన్ మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రజల ఆస్తిగా భావించాలన్నారు. వీటిని అభివృద్ధి చేస్తే ప్రజలకు సంక్షేమ కార్యక్రమం అమలు జరిపినట్టేనన్నారు. ఆర్థిక వనరులు లేక గ్రంథాలయాల పురోగతి ఆగిపోయిందన్నారు. ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ యాత్రను జివిఎంసి 98 వార్డుల్లోనూ యువతను భాగస్వామ్యం చేసి చేపట్టాలన్నారు. గతంలో టిడిపి విద్యాశాఖ మంత్రిగా ఉన్నటువంటి గంటా శ్రీనివాసరావు జిల్లా గ్రంథాలయ స్థలాన్ని కొట్టేసే విధంగా కుట్రపన్నారని, దాన్ని పోరాటాలతో ఎలా అడ్డుకున్నదీ వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ మేధావుల అభిప్రాయాలు, సూచనలు తీసుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. గ్రంథాలయ నిధుల దుర్వినియోగాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి, జర్నలిస్టు, సాహితీవేత్త నల్లి ధర్మారావు, విశాఖ పౌర గ్రంథాలయం జాయింట్ సెక్రటరీ డాక్టర్ డివి.సూర్యారావు, పౌర గ్రంథాలయ సేవాసమితి అధ్యక్షులు బిఎల్.నారాయణ, సాహితీవేత్త మేడా మస్తాన్ రెడ్డి, ఇతర ప్రముఖులు శిరేల సన్యాసిరావు, కె.నరసింహం, బద్రి కూర్మారావు, డాక్టర్ జైపాల్, జయదేవ్, హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ చర్చాగోష్టి నిర్వాహణలో బసు పోతన, బుడుమూరి సూర్యారావు, రత్నాల బాలకృష్ణ, ఉప్పల అప్పలరాజు పాలుపంచుకున్నారు.

### నీట్ ఫలితాల్లో విజయకేతనం



నీట్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన శ్రీ విశ్వ విద్యార్థులు

1865, ఎం.లక్ష్మీరాజు 2228, ఎస్.హర్షవర్ధన్ 2856, డి.వివేక్ 3260, టి.కావ్య ప్రవళిక 5180 ర్యాంకులు సాధించారు. సాధారణ విద్యార్థులతో శ్రీ విశ్వ కళాశాల అసాధారణ ఫలితాలు సాధించిందని, 1000లోపు ఇద్దరు, 5000లోపు 8 మంది, 10000లోపు 16 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని, మొత్తం 131 మంది విద్యార్థులు నీట్‌లో ర్యాంకులు తెచ్చుకోవడం విశేషమని శ్రీ విశ్వ విద్యాసంస్థల చైర్మన్ కె.ధర్మరాజు తెలిపారు

ఈ సందర్భంగా ఈ ఘనత సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీ విశ్వ విద్యాసంస్థల డైరెక్టర్ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు

## సమాచార శాఖ ఉప సంచాలకులుగా రమేష్



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రమేష్

**ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ :** సమాచార పౌర సంబంధాల శాఖ, విశాఖపట్టణం ఉప సంచాలకులుగా డి.రమేష్ బాధ్యతలు (ఎఫ్ఎసి) స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకూ విజయనగరంలో ఎడిగా సేవలందిం చారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో విశాఖపట్టణంలోని ఎస్ఐసి (రాష్ట్ర సమాచార కేంద్రం) ఎడిగా విచ్చేసిన ఆయన విశాఖపట్టణం సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఉపసంచాలకులుగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్‌లను వారి ఛాంబర్లలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సమాచారపౌర సంబంధాలశాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్‌ను కూడా కలిశారు. రమేష్ నియామకం పట్ల సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో బాధ్యతలు నిర్వర్తించిన ఎస్.వి.రమణ అనకాపల్లి బదిలీపై వెళ్లారు.

## 'తల్లికి వందనం'లో లక్షకుపైగా అనర్హులా ?

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నేతల హామీ ఇచ్చి, లక్షమందికి పైగా అనర్హులు చేసి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ విమర్శించారు. శనివారం ఆసీలుమెట్ట కార్యాలయంలో 39వ వార్డు పోస్టాఫీసు ప్రాంతానికి చెందిన రెహానా భాష (12) స్కూల్ ఫీజుకి వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది తర్వాత తల్లికి వందనం పథకం హడావిడిగా ప్రారంభించి లబ్ధిదారుల సంఖ్యలో భారీ కోత విధించారన్నారు. కార్యక్రమంలో 39వ వార్డు వైసిపి అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, దశమంతుల మాణిక్యాలరావు, పాల్గొన్నారు.

## రూ. 3.5 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్ర అభివద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, అదే లక్ష్యంతో విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోందని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శనివారం దక్షిణ నియోజకవర్గంలో సుమారు రూ.3.58 కోట్ల జివిఎంసి నిధులను వెచ్చించి పలు అభివృద్ధి పనులకు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు సి.హెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపనలను, ప్రారంభోత్సవాలను చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.

## 16న విశాఖలో సిఎం పర్యటన

(మొదటి పేజీ తరువాయి..)

చేరుకుంటారు. అక్కడ 12:15 గంటల నుంచి 1:30 గంటల వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు.

భోజన విరామం అనంతరం 2:30 గంటలకు నోవాటెల్ హోటల్ నుండి బయలుదేరి 2:50 గంటలకు పిఎం.పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని 3 గంటల నుంచి 5 గంటల వరకు కేడర్ సమావేశంలో పాల్గొంటారు.

సమావేశ అనంతరం 5 గంటలకు వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ నుండి బయలుదేరి 5:25 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. అక్కడి నుంచి 5:35 గంటలకు విమాన మార్గంలో విజయవాడ బయలుదేరి వెళ్తారు.

### నేడు జయహో శ్రీశ్రీ సాంస్కృతిక కళా ప్రదర్శనలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** మహాకవి శ్రీశ్రీ 42వ వర్ధంతి సందర్భంగా ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటి ఆధ్వర్యంలో జయహో శ్రీశ్రీ పేరుతో సాంస్కృతిక కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటి ఒక ప్రకటనలో పేర్కొంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, నాలుగోఫ్లోర్ బిగ్ మినీ హాల్లో కార్యక్రమం ఉంటుందని ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంటి తెలిపారు.

### విశాఖ క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖపట్నం క్రైమ్ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో జరిగాయి. రెండేళ్ల పాటు కొనసాగే నూతన కమిటి అధ్యక్షునిగా దాడి రవి కుమార్, కార్యదర్శిగా ఎబిఎన్ సతీష్, ఉపాధ్యక్షులుగా బండి శివరామకష్ణ (ఎఎన్ఐ)గిరి(ఎస్ డివి) సంయుక్త కార్యదర్శులుగా నల్లా రాము ( టైమ్స్ ఆఫ్ ఇండియా) ఎ.నరేష్ (సాక్షి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్.బానోజీ (ఇండియా టుడే), కోశాధికారిగా పి.వాసు (హేన్స్ ఇండియా) కార్యవర్గ సభ్యులుగా సనపల చినబాబు (విజయభాను), గురుగు బిల్లా శ్రీనివాసరావు (ఆంధ్రప్రభ), కె. విజయ్‌కుమార్ (లీడర్) భాగ్యరాజ్ (ప్రజాశక్తి), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.ఎస్.ఆర్.ప్రసాద్ ఎన్నికయ్యారు.

# మంచినీరు పోయే.. మురుగు వచ్చె..!

- కాలుష్య కారకాలుగా మారిపోతున్న గెడ్డలు
- వర్షపు నీటి నిర్వహణలోలోపించిన ప్రణాళిక
- నానాటికీ తీవ్రమౌతున్న మురుగు నీటి సమస్య



మురుగుకాలువగా మారిన మంచినీటి గెడ్డ

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : వర్షపు నీటి నిర్వహణలో లోపించిన సమగ్ర ప్రణాళిక, అటకెక్కిన పర్యావరణ నిబంధనలు, ఇష్టారీతిన వెలుస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాలు, సమగ్ర మురుగునీటి వ్యవస్థ ఏర్పాటులో లోపం వెరసి పట్టణాల్లో పలుచోట్ల మురుగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. వాడుక , వర్షపునీరు మళ్లిపోయే వీలులేకపోవడం, వాటిని ఇష్టారాజ్యంగా గెడ్డల్లోకి మళ్లించడంతో ఒకప్పుడు మంచినీటికి నెలవుగా ఉన్న గెడ్డలన్నీ ఇపుడు మురుగునీటి కూపాలుగా మారిపోతున్నారు. అపారిశుధ్యం, దుర్వాసనతో పరిసర ప్రాంత వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనికి ఉదాహరణలు కోకొల్లలు దర్శనమిస్తున్నాయి. .

మురుగు నీటిని, వర్షపు నీరు వెళ్లే కాల్వలతో అనుసంధానించ కూడదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, కాలుష్యనియంత్రణమండలి రూపొందించిన నిబంధనల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, అనేక చోట్ల ఇది అమలుకు నోచుకోవడం లేదు. జివిఎంసి రెండో వార్డు బ్యాంక్ కాలనీకి అనుకుని ఉన్న కెవి భూములు ప్రాంతంలో ఉన్న ఓ గెడ్డలో సాగర వికాస సహకార పొదుపు సంఘం కార్యాలయానికి ఎదురుగా ఉన్న గెడ్డ ద్వారా ఒక నాడు వర్షపు నీరు, మంచి నీరు మాత్రమే వెళ్లేదని స్థానికులుఅంటున్నారు. పట్టణీకరణ ప్రభావంతో అనేక ప్రాంతాల్లో మాదిరిగానే ఇక్కడా అపార్ట్‌మెంట్లు నిర్మాణం జోరుగా సాగుతున్నాయి. వాటిల్లోని నివాసితులు వాడిన నీటిని నియంత్రణ, మళ్లింపునకు డ్రైనేజీ సదుపాయం లేకపోయినా జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఇష్టారీతిన నిర్మాణ అనుమతులు ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్పష్టంగా కనిపిస్తోంది. అపార్ట్‌మెంట్లలోని వాడుకనీరు భారీగా ఈ గెడ్డలో కలవడంతో, దీంతో ఐదారేళ్ల క్రితం వరకు మంచినీరు ప్రవహించే గెడ్డకాస్తా మురుగనీటి మయంగా మారిపోయిందని, దుర్వాసన, అపారిశుధ్యంతో అవస్థలు పడుతున్నామని పొదుపుసంఘాల మహిళలు, స్థానికులు వాపోతున్నారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణ అనుమతులసందర్భంగా భూగర్భజలాలు, నీటి సౌలభ్యత, పర్యావరణ నిబంధనలు, మురుగు నీటి సరఫరా లాంటి ప్రధాన అంశాలను సంబంధిత అధికారులు కనీస పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. చిట్టివలస పెద్ద చెరువులో కూడా చుట్టూరా నిర్మించిన అపార్ట్మెంట్లు వాడుక నీరు వివిధ కాల్వల ద్వారా కలుస్తూ మురుగనీటి మయం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఉదాహరణలున్నాయని అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత జివిఎంసి అధికారులు దీనిపై దృష్టి పెట్టి, ఇప్పటికే నిర్మాణం పూర్తయిన అపార్ట్‌మెంట్లలోని వాడుకనీరు మళ్లింపునకు ప్రత్నామ్నాయ చర్యలు చేపట్టడంతోపాటు కొత్త అనుమతుల సమయంలో నిబంధనలన్నీ పాటించేలా చూడాలని కోరుతున్నారు.

### మురుగు నీటిని మళ్లించాలి



గెడ్డలోకి వాడుక నీరు రాకుండా ప్రత్యామ్నాయంగా కాల్వలు నిర్మించి, మురుగు నీటిని మళ్లించాలి. మూగ జీవాల దాహార్తిని తీర్చడంతో పాటు ప్రజల అవసరాలకు ఉపయోగపడే గెడ్డలు కాలుష్య కారకమయ్యాయి.

– శ్రీనివాస్, బ్యాంక్ కాలనీ, భీమిలి.

### దుర్వాసనతో ఇబ్బందులు



మురుగునీటి కాల్వలను సక్రమంగా నిర్మించలేదు. చాలా చిన్నవిగా నిర్మించారు. దీంతో చెత్తా చెదారాలు పేరుకుపోయి నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతూ చాలా ఇబ్బందులు పడుతున్నాం

– టి కనక, బ్యాంక్ కాలనీ, కె వి భూములు.

### తీవ్రమౌతున్న నీటి కష్టాలు



ఇష్టారీతిన అపార్ట్‌మెంట్ల నిర్వహణతో పెరిగిన నీటి అవసరాలకు సరిపడా భూగర్భ, ఉపరితల జలాల నిల్వలు లేవు.. ఇటువంటి పరిస్థితుల్లో మంచినీటి గెడ్డలు కూడా మురుగుమయం కావడం కష్టాలను తీవ్రం చేస్తున్నాయి.

–టి వెంకటలక్ష్మి, బ్యాంక్ కాలనీ, కెవి భూములు.

## నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

**ప్రజాశక్తి -నక్కపల్లి:** మండలంలో ఉపమాక పంచాయతీ శివారు ప్రాంతంలో ఐదు లీటర్ల నాటు సారాతో పట్టుబడ్డ పెంకె సత్తిబాబు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. నాటు సారా స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. నాటు సారా తయారుచేసినా, విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కేసులు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## చీటీ సొమ్ము తీసుకుని మోసం

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన కీరపల్లి జ్యోతి రాజారావు అనే మహిళ చీటీ సొమ్ము తీసుకుని వాయిదాలు చెల్లించుకుండా మోసగించారని అదే ప్రాంతానికి చెందిన కోన పద్మ శనివారం ఉదయం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు పోలీసులు అందించిన వివరాలు ప్రకారం చీటీ నిర్వహకురాలు కోన పద్మ, 20 మంది సభ్యులతో ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.15000 చొప్పున 20 నెలల పాటు చీటి ప్రారంభించింది. ఇందులో మూడు చీటీలు కడుతున్న కేసరపల్లి జ్యోతి, మూడవ చీటీ, ఐదవ చీటీ, ఏడవ చీటీ పాడుకుని, చీటీ నిర్వాహకురాలి నుంచి రూ. 9 లక్షలు తీసుకుంది. అనంతరం నెలసరి వాయిదాలు చెల్లించకపోవడంతో దీనిపై ప్రశ్నించగా, తన పెద్ద కుమారుడు పవన్ తో కలిసి జ్యోతి తగాదాకు దిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాక డబ్బులు ఇవ్వకుండా, ఫోన్లకు స్పందించకుండా జ్యోతి, పవన్ తిరుగుతున్నారన్నారు. జ్యోతి ఇప్పటివరకు రూ. 3,65,375 చెల్లించగా, మరో రూ. 5,43,625 చెల్లించాల్సి ఉందనిఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన ఎంవిపి సీఐ జె.మురళి దర్యాప్తును ఏఎస్ఐ ఆదిరాజుకు అప్పగించారు.

## పంచ గ్రామాల భూసమస్యపై నేటి నుంచి ధర్నాలు

**ప్రజాశక్తి- వేపగుంట** : పంచగ్రామాల భూసమస్యపై రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సింహాచలం జంక్షన్‌లో ఈనెల 15 నుంచి ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు టి.కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆందోళనకు అన్ని గ్రామాల నుంచి ప్రజలు, బాధితులు తరలిరావాలని పిలుపునిచ్చారు

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**ప్రజాశక్తి- సీతమ్మధార :** జివిఎంసి 44,51 వార్డుల పరిధిలోని ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 7,85,090 ఆర్థికసాయం చెక్కులను ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు లబ్ధిదారులకు అందజేశారు. శనివారం నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని బిజెపికార్యాలయంలో లబ్ధిదారులు చిన్న కొండేపూడికి చెందిన పిఎన్ఎస్.వర్మకు రూ.3,50లక్షలు, సాయిచరణ్ ప్రకాష్‌కు రూ.రెండు లక్షలు, కొయిలాడ పద్మావతికి రూ.30వేలు, సూరు మాణిక్యాలరావుకు రూ.60వేలు, కె. అలివేలు మంగదేవికి రూ.70వేలు, సామిరెడ్డి రాజేశ్వరిని రూ.75,090 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పరశు రామరాజు, శ్యామల దీపిక, ఉషాకిరణ్, సురేష్‌బాబు, కోయిలాడ వెంకటేష్, నాగరాజు, మళ్ల లక్ష్మి పాల్గొన్నారు.

## 'అర్హులందరికీ తల్లికి వందనం'

**ప్రజాశక్తి -తగరపువలస** : నిబంధనలకు లోబడి ఉన్న అర్హులందరికీ తల్లికి వందనం పథకం వర్తిస్తుందని టిడిపి నాయకులు పిట్ట సురేష్ శనివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారు, ఆదాయపుపన్ను చెల్లించిన వారు, 3 ఎకరాలు కంటే ఎక్కువ సాగు భూమి ఉన్న వారు , వెయ్యి చదరపు గజాల కంటే ఎక్కువ విస్తీర్ణం గల ఇల్లు ఉన్న వారు, నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వాడిన వాళ్ళకు ఈ పథకం వర్తించదన్నారు.

అర్హులై ఉండి ఈ పథకం వర్తించని వారు సమీపంలో ఉన్న వార్డు సచివాలయంలో సంబంధిత సిబ్బంది ఈ నెల 20 వరకు గ్రీవెన్స్‌లో అభ్యంతరాలు స్వీకరిస్తారని, పరిశీలన అనంతరం అర్హులైతే పథకం వర్తిసుందన్నారు. అర్హులెవరూ ఆందోళన చెందనవసరం లేదన్నారు.

## విమాన ప్రమాద మృతులకు సంతాపం

**ప్రజాశక్తి -ములగాడ** : అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిన ఘటనలో మృతులకు విశాఖపట్నం శ్రామికశక్తి లేబర్ యూనియన్ వ్యవస్థాపకులు, కాపునాడు జిల్లా అధ్యక్షులు పెద్దిరెడ్ల నానాజీ సంతాపం తెలపారు. శనివారం పారిశ్రామిక ప్రాంతంలో అసంఘటిత కార్మికులతో కలిసి కొద్దిసేపు మౌనాన్ని పాటించారు.

## అప్పన్నను దర్శించుకున్నరైల్వే జిఎం

**ప్రజాశక్తి- వేపగుంట** : సింహాద్రి వరహా నరసింహ స్వామిని శనివారం సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్‌మాథుర్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించు కున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలకగా, అప్పన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం రైల్వే జిఎంను ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, ఎఇఒ తీర్థప్రసాదాలు, శేష వస్త్రం, స్వామి చిత్రపటం బహూకరించారు. రైల్వేశాఖ విశాఖ సిఎఒ అంకుష్ గుప్తా, చీఫ్ ఇంజినీర్ డి శ్రీనివాసరావు ఉన్నారు

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నేవల్ వైద్యుల దుర్మరణం

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** నగరంలోని కాన్వెంట్ జంక్షన్ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నేవల్ ఆసుపత్రి వైద్యులు దుర్మరణం పాలయ్యారు. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు మల్కాపురం పరిధిలోని సింధియా వద్ద గల కల్యాణి నేవల్ ఆసుపత్రిలో లెఫ్టినెంట్ హోదాలో మేఘా రావత్(24), సౌమ్య సతీష్ (25) వైద్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో షీలా నగర్ నుండి ఎస్సార్ జంక్షన్ మీదుగా కాన్వెంట్ జంక్షన్ వైపు ద్విచక్ర వాహనంపై ఇద్దరూ బయలుదేరారు .సతీష్ డ్రైవింగ్ చేస్తుండగా, బైక్ వెనక మేఘ రావత్ కూర్చొని ఉన్నారు. సరిగ్గా ఎస్సార్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ వైపు కటింగ్ అవుతుండగా అదే మార్గంలో వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ను తప్పించబోయి అదుపుతప్పి ద్విచక్ర వాహనంతో పాటు వైద్యులిద్దరూ కింద పడిపోయారు. వారిద్దరి పైనుంచి ట్యాంకర్ దూసుకుపోవడంతో వెనక చక్రాల కింద పడి అక్కడికక్కడే ఇద్దరు చనిపోయారు. దుర్ఘటనలో గుర్తుపట్టని విధంగా వారి తల భాగం నుజ్జునుజ్జు కావడం, రక్తంతో శరీర భాగాలు రోడ్డుపై పడి ఉండడం చూపురులను కలిచి వేసింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ మార్చురీకి తరలించారు .హార్బర్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మూడో అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి -తగరపువలస** : జివిఎంసి రెండో వార్డు సంగివలస కెబిఆర్ అపార్ట్‌మెంట్‌లో మూడో అంతస్తునుంచి ప్రమాదవశాత్తు పడడంతో ఒక వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం..

సంగివలస కెబిఆర్ అపార్ట్మెంట్‌లో నివాసముంటున్న సనాసి వెంకటరావు (53) శనివారం కాలుజారడంతో మూడో అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రగాయాలైన వెంకటరావు మృతి చెందాడు.ఈ మేరకు మృతుని భార్య సుగణకు అపార్ట్‌మెంట్ వాచ్‌మ్యాన్ సమాచారమిచ్చాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ యు.నూకరాజు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ఆసుపత్రికి తరలించారు. మృతుడు వెంకటరావు ఆనందపురం మండలంలోని ఓ ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.

### పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**ప్రజాశక్తి-కశింకోట :** మండలంలోని కంచర్లపాలెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై శనివారం పోలీసుల దాడి 13 మందిని అరెస్ట్ చేశారు. వారి నుండి రూ.1,02,348 నగదు స్వాధీనం చేసుకున్నట్లు కశింకోట సీఐ స్వామి నాయడు తెలిపారు. కచర్లపాలెం సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతుండగా, ముందస్తు సమాచారం మేరకు కశింకోట పోలీసులు పేకాట శిబిరంపై మెరుపుదాడి చేసినట్లు చెప్పారు. 52 పేకాట ముక్కలు, రూ.1,02,348 నగదు, 4 మోటార్ సైకిళ్లు, 12 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని, 13 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఎస్ఐలు కె.లక్ష్మణరావు, పి.మనోజ్‌కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### 10 కిలోల గంజాయి స్వాధీనం

#### - ఇద్దరు నిందితుల అరెస్టు

**ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ :** ఏజెన్సీ నుండి తమిళనాడుకు వాహనంలో తరలిస్తున్న 10 కేజీల గంజాయిని అనకాపల్లి గూడ్స్ రోడ్డు వద్ద పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరి నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు సిఐ విజయ్ కుమార్ శనివారం కేసు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు గూడ్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అటువైపు వచ్చిన వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 10 కేజీల గంజాయిని గుర్తించారు. గంజాయి తరలిస్తున్న తమిళనాడుకు చెందిన రామన్ ప్రభాకర్, దేవరలను అరెస్టు చేశారు. పాడేరు నుంచి కొనుగోలు చేసి తమిళనాడులో చిన్న చిన్న ప్యాకెట్‌లు చేసి అమ్ముకుంటామని నిందితులు తెలిపారు. నిందితుల నుండి 10 కేజీల గంజాయిని, సెల్ ఫోన్‌లు, వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై ఈశ్వరరావు పాల్గొన్నారు.

## 17న ఇపిఎస్ 95 పెన్షనర్ల విశాఖ జిల్లా సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న బాబాజీ

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖ జిల్లా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎన్ఎడి కొత్త రోడ్డు జంక్షన్ వద్దగల ఆహ్వానం ఫంక్షన్ హాల్‌లో ఇపిఎస్ 95 పెన్షనర్ల విశాఖ జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.దీనబంధు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా నాయకులు కుమార మంగళం, కె.సుధాకరరావు, ఎస్‌కె.హుస్సేన్, కె.దీనబందు, కెపి.కుమార్, భాస్కరరావు, శ్రీనివాసమూర్తి, రామలింగేశ్వరరావు సహా కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడతారని తెలిపారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

### పెన్షనర్ల సదస్సుజయప్రదం చేయండి

**తగరపువలస** :ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న విశాఖ ఎన్ఎడి కొత్తరోడ్డు జంక్షన్ దరి ఆహ్వాన కల్యాణ మండపంలో నిర్వహించే పెన్షనర్ల ప్రాంతీయ సదస్సును విజయవంతం చేయాలని చిట్టివలస ప్రాంత ఎంప్లాయిస్ ప్రావిడెంట్‌ఫండ్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కానూరు రాంబాబు, దామోదర బాబాజీ. సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, తెలిపారు. శనివారం . చిట్టివలస లేబర్‌వెల్ఫేర్ సెంటర్‌లో జ్యూట్‌మిల్లు పింఛనుదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బాబాజీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ హయ్యర్ పింఛను పొందే అవకాశం కల్పించాలన్నారు. కనీస పింఛను రూ.9 వేలు ఇస్తూ, డిఎ అనుసంధానించాలన్నారు. పెన్షనర్ల దంపతులకు వైద్య సదుపాయం, రైల్వే రాయితీ పునరుద్ధరించాలని కోరారు. ఇపిఎస్ 95 పెన్షనర్లందరికీ రేషన్ కార్డులు, ఎన్‌టిఆర్ వైద్యసేవ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు వివిధ రూపాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, ఐక్యంగా పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమౌతాయన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సత్కారం



జనార్ధనరావును సన్మానిస్తున్న వాకర్స్

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన ఎన్.జనార్ధనరావును శనివారం జమ్మి చెరువు అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జమ్మి చెరువు పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో సన్మానగ్రహీత జనార్ధనరావు మాట్లాడుతూ, జమ్మి చెరువు పార్కు ఆధునీకరణ అంశం జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో వాకర్స్ శంకర్‌కుమార్, దత్తి ఈశ్వరరావు, వెంకటరావు, సత్యనారాయణరెడ్డి, ఎస్.జోగారావు పాల్గొన్నారు

## స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపేస్తున్నట్టు

# ప్రధాని మోడీ ప్రకటించాలి

- తొలగించిన4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి సమావేశంలో నాయకుల డిమాండ్
- 16 నుంచి నిరసనలకు పిలుపు




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖ స్టీల్‌ప్లాంటు అమ్మకం నిలిపేస్తున్నట్లు ఈ నెల 20న విశాఖ విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ ప్రకటన చేయాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. , తొలగించిన 4 వేల మంది స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కు నిరాహారదీక్ష శిబిరంపై కూటమి ప్రభుత్వ పోలీసు నిర్బంధం నిలిపివేయాలన్నారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా జెఎసి రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఎం. జగ్గునాయుడు, వైస్ చైర్మన్లు ఎం.మన్మథరావు, బి.నాగభూషణం, ఎన్. కనకారావు మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పరిరక్షణకు నాలుగున్నరేళ్లుగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద కార్మికులు చేపడుతున్న రిలే నిరాహారదీక్ష శిబిరం పునర్నిర్మాణానికి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పూనుకుంటే పోలీసులను పంపి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ప్రస్తుత గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ శిబిరంలో దీక్షల్లో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. దీక్షాశిబిరంలో పోలీసులు బైఠాయించి, పర్మినెంట్, కార్మికులు కూర్చో కుండా కేసులు పెడతామని బెదిరించడం, కార్మికుల ప్రజాతంత్ర హక్కును కాలరాయడమేనని మండిపడ్డారు. .దీనిని జెఎసి తరపున తీవ్రంగా ఖండించారు. విపక్షంలో ఉన్నపుడు నీతులు చెప్పిన కూటమి పార్టీల నేతలు, ఇపుడు కార్మిక హక్కులు కాలరాయడం దుర్మార్గమన్నారు. దీక్షాశిబిరానికి ఎటువంటి ఆటంకాలు కలిగించినా సహించేది లేదన్నారు.

మూడవ బ్లాస్ట్ ఫర్నేస్‌ను పున:ప్రారంభించి, పూర్తిస్థాయి ఉత్పత్తితో లాభాలబాట పట్టించి .స్టీల్‌ప్లాంటును అభివృద్ధి చేస్తామని హామీలిచ్చిన కూటమి నేతలు, ఇపుడు అవసరానికి మించి కార్మికులున్నారని, 30ఏళ్లుగా పనిచేస్తున్న 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను నిర్దాక్షణ్యంగా,చట్ట విరుద్ధంగా తొలగించడం దుర్మార్గమన్నారు. కార్మికులు ఎక్కువగా వుంటే కొత్తవారిని ఎందుకు నియమిస్తున్నారని జెఎసి నేతలు ప్రశ్నించారు. టిఎంసి పేరుతో బడా ప్రయివేటు సంస్థలను తెచ్చి ఇతర రాష్ట్రాల కార్మికులను నియమించి దోపిడీకి సిద్ధపడుతున్నారని,.ఇది విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ కుట్రలో భాగమేనని జెఎసి నేతలు మండిపడ్డారు. అక్రమ తొలగింపులు నిలిపివేసి, 4 వేలమంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విశాఖ ఎంపి, గాజువాక ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆగిపోయిందని కూటమినేతలు ప్రకటిస్తున్నారే తప్ప, ప్రధానిమోడీగానీ, కేంద్రంగానీ ప్రకటించడంలేదన్నారు. దీనిపై.ఈనెల 20న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీతో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రకటన చేయించాలని జెఎసి నేతలు డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 16 నుంచి 21 వరకు జిల్లాలోని హైవే ప్రధాన కూడళ్ళు, పరిశ్రమలు గేట్లు, కార్మికులు పని ప్రధేశాల్లో నిరసనలు చేపట్టాలని జెఎసి నిర్ణయించింది.కార్మికులు,ప్రజలు వీటిలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె. రెహమన్‌ఎఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె.దేవ సహాయంఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు యుఎస్ఎన్. రాజు, డి.ఉమాశైలజ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె. నాయుడు, పిఎన్‌ఎం జిల్లా కార్యదర్శి ఎం.చంటి పాల్గొన్నారు.

## వినియోగదారులకు విద్యుత్ బిల్లుల షాక్!






సన్యాసమ్మకు వచ్చిన బిల్లు,

**ప్రజాశక్తి- ఆనందపురం** : మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో విద్యుత్ బిల్లుల షాక్‌తో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. నెలసరి వచ్చే మామూలు బిల్లుల కంటే ఇరవై, ముప్పై రెట్లు అధిక మొత్తంలో ఈ నెల బిల్లు రావడంతో తేరుకోలేని పరిస్థితి ఉంది. కొన్నాళ్లుగా పెరిగిన బిల్లులను చెల్లించలేక సతమతమౌతున్న వారంతా తాజాగా వచ్చిన బిల్లులను చూసి బిగుసుకుపోయే పరిస్థితి ఉంది.

జగన్నాథపురానికి చెందిన మతికాన సన్యాసమ్మ వినియోగదారులకు ఎపుడూ నెలసరి రూ.300లోపే విద్యుత్ బిల్లు వచ్చేది. గతనెలలోనూ. రూ.300బిల్లురాగా, ఈనెలలో ఏకంగా రూ.6,719 బిల్లు రావడంతో మాటరాని పరిస్థితి నెలకొంది. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఆకుటుంబం, మామూలు బిల్లులను చెల్లించడమే భారంగా ఉందని భావిస్తున్న నేపథ్యంలో ఈ భారీ బిల్లు ఎలా చెల్లించాలని ఆవేదన చెందుతోంది. అదేగ్రామానికి చెందిన అదే గ్రామానికి చెందిన బంక శ్రీను, పాండ్రంకి శ్రీరామ్ ప్రసాద్, ఇలా మరికొందరు వినియోగదారులకు కూడా కళ్లు తిరిగిపోయేలా అధికబిల్లులు వచ్చాయని అంటున్నారు. దీనిపై బిల్లులను పట్టుకుని వెళ్లి స్థానిక విద్యుత్ శాఖ అధికారులను సంప్రదిస్తే, ముందుగా బిల్లు మొత్తం చెల్లించాలని, అనంతరం మీటరును పరిశీలించి సమస్య ఉంటే పరిష్కరిస్తామని చెప్పడంతో ఏంచేయాలో పాలుపోక సతమతమౌతున్నారు.

దీనిపై విద్యుత్ ఎఇఇ అప్పలనాయుడు వివరణ కోరగా, వచ్చిన బిల్లు ముందుగా చెల్లించాలని, లేకుంటే గడువుదాటితే నిబంధనల మేరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు. తర్వాత పరిశీలించి సాంకేతిక లోపముంటే సరిచేస్తామన్నారు. కాగా కూటమి పాలనలో విద్యుత్ బిల్లుల భారం ఉండబోదని ముందుగా ప్రకటించి, కొన్నాళ్లుగా అధిక బిల్లులు వడ్డిస్తుండగా, ఇపుడు అనూహ్య బిల్లులను చూసి వినియోగదారులు ఖిన్నులౌతున్నారు.

## విశాఖలో సదరన్ సినర్జీ ప్రారంభం



కాన్‌క్లేవ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

**ప్రజాశక్తి -మధురవాడ** : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ చైర్మన్ ఆర్. సురేష్‌కుమార్ బండారు నాయకత్వంలో నిర్వహిస్తున్న డిజైన్, ఆర్కిటెక్చర్ కాన్‌క్లేవ్, సదరన్ సినర్జీ 2025ను విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ శనివారం ప్రారంభించారు. మధురవాడలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో శ్రీభరత్ మాట్లాడుతూ, డిజైన్ కమ్యూనిటీని ఏకతాటిపైకి తీసుకురావడంలోనూ, సృజనాత్మక, నిర్మాణ ఆవిష్కరణలకు పెరుగుతున్న కేంద్రంగా విశాఖను హైలైట్ చేయడంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు.

నిర్వాహకులు ఆర్. సురేష్‌కుమార్ బండారు మాట్లాడుతూ ఆదివారం వరకు ప్రతిపోజూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు నిర్వహించే ప్రదర్శనకు ప్రవేశం ఉచితమన్నారు. ఈ ఎక్స్‌పోలో 300 క్యూరేటెడ్ ఇంటీరియర్ డిజైన్ ఆర్కిటెక్చరల్ ప్రొడక్ట్ స్టాల్స్, ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు, విద్యార్థుల డిజైన్ షోకేస్‌లు ఉన్నాయన్నారు. సినర్జీలో హైదరాబాద్, బెంగళూరు, కేరళ, కోయంబత్తూర్, గోవా భువనేశ్వర్‌లతో సహా దక్షిణ ప్రాంతం అంతటా 250 మందికి పైగా ఆర్కిటెక్ట్‌లు డిజైన్ నిపుణులు పాల్గొంటారన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు.

## గాంధీనగర్ అంగన్వాడీలో గ్రాడ్యుయేషన్ డే

**ప్రజాశక్తి- సీతమ్మధార :** జివిఎంసి 51వ వార్డు గాంధీనగర్ ఆంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు ఐదేళ్ళు పూర్తి చేసుకున్న చిన్నారులకు సిబ్బంది సర్టిపికెట్లు అందజేశారు. అలాగే పలక, పెన్సిల్,ఎరేజర్‌తో కూడిన కిట్లను బహుమతిగా అందించారు. తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలో భాగంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి, వారిని రెగ్యులర్ పాఠశాలల్లో జాయినింగ్ చేసే చర్యలు చేపట్టారు. అర్బన్ సిడిపిఒ నీలిమ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మౌలా బీబీ, ఎంఎస్‌కె.వరలక్ష్మి, ఎఎన్ఎం స్రవంతి, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెట్ల మార్గం ఏర్పాటుపై చర్చ

**ప్రజాశక్తి- గాజువాక:** జివిఎంసి 65వ వార్డు రాజీవ్ మార్గ్, మార్కెట్‌కు ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో శనివారం వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అధికారులతో కలిసి పర్యటించారు. రెండు వందల కుటుంబాలు నివాసముంటున్న ఈ ప్రాంతంలో మెట్లమార్గం సరిగా లేక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్న నేపథ్యంలో దీనిపై స్థానికులతో సమావేశమై కార్పొరేటర్ నరసింహపాత్రుడు చర్చించారు. మెట్ల మార్గం నిర్మాణానికి తాను కృషి చేస్తానని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఆయా ప్రాంతంలో ప్రజలు పడుతున్న కష్టాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ హామీనిచ్చారు.

# అర్హులందరికీ తల్లికి వందనం ఇవ్వాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

**ప్రజాశక్తి-అనకాపల్లి**

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు 'తల్లికి వందనం' పథకం కింద నగదును నిబంధనలు సడలించి అర్హులైన విద్యార్థులందరి తల్లుల ఖాతాల్లో జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అడ్డగోలు నిబంధనలతో దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని, ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో రూ.2.50 లక్షలు, పట్టణాల్లో రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటికి తల్లికి వందనం వర్తింపజేయాలని కోరారు. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే అందరికీ నగదు జమ చేయాలన్నారు. స్కీం వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేయాలని కోరారు. గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమి నేతలు నేడు అంతకుమించిన షరతులు పెట్టి లబ్ధిదారులను తగ్గించడం సరికాదన్నారు. రూ.15వేలు ఇస్తామని చెప్పి అందులో రూ.2,000 మినహాయించడం భావ్యం కాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్న విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయించడం హామీ ఉల్లంఘనే అవుతుందని తెలిపారు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న వారి తల్లులకు కాకుండా నేరుగా స్కూళ్ల మేనేజ్‌మెంట్‌ల ఖాతాలకు చెల్లించడం సరికాదన్నారు. గ్రామ వార్డు సచివాలయాలలో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ ఈ పథకం అమలు చేయాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

## స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయాలి : సిఐటియు

**అనకాపల్లి** : చిరుద్యోగులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం "తల్లికి వందనం" పథకాన్ని రాష్ట్రంలో అత్యంత తక్కువ జీతాలతో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశా, వెలుగు విఒఎ వంటి స్కీమ్ వర్కర్లకు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ వర్తింపజేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు అనేక నిబంధనల పేరుతో స్కీమ్ కార్మికులకు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఈ పథకాన్ని వర్తింపజేయకపోవడం సరికాదన్నారు. వీరందరూ అత్యంత పేద వర్గాలకు చెందిన వారని, వీరి చేత అతి తక్కువ జీతాలతో పని చేయించుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి తల్లికి వందనం ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి




మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్

వీరందరికీ తల్లికి వందనాన్ని అమలు చేయాలన్నారు. లేకుంటే ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చేగువేరా చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

## చేగువేరా 98వ జయంతి

**ప్రజాశక్తి-రాంబిల్లి** : ప్రపంచ విప్లవకారుడు చేగువేరా 98వ జయంతి కార్యక్రమాన్ని డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని గజరెడ్డిపాలెం గ్రామంలో శనివారం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు మాట్లాడుతూ కష్టజీవులు సృష్టించిన సంపద ప్రజలందరికీ చెందాలని, మహోన్నతమైన సోషలిస్టు సమ సమాజం కోసం పోరాడి వీర మరణం చెందారని పేర్కొన్నారు. చేగువేరా స్ఫూర్తితో దేశంలో కార్మిక కర్షక మైత్రితో ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వై రాము, సిఐటియు మండల కన్వీనర్, చందక రామకృష్ణ, మహిళలు, పెద్దలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

## పూడిమడకలో పరిసరాల పరిశుభ్రత

**ప్రజాశక్తి-అచ్యుతాపురం** : మండలంలోని పూడిమడక పంచాయతీ పరిధిలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని రమణ పర్యవేక్షణలో చేపట్టారు. పాత బస్టాండ్, చేపల మార్కెట్ నుంచి హైస్కూల్‌కు వెళ్లే రహదారికి ఇరువైపుల పేరుకుపోయిన వ్యర్థాలను జెసిబి, ట్రాక్టర్‌తో దూర ప్రాంతాలకు తరలించారు.

## ఎమ్మెల్యే గణబాబును కలిసిన బుచ్చిరాజు

**ప్రజాశక్తి-సబ్బవరం** : శాప్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎన్ రాజు (బుచ్చిరాజు) శనివారం విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. గణబాబును దుస్సాలువాతో సత్కరించారు. అనంతరం బుచ్చిరాజును ఎమ్మెల్యే గణబాబు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి దేముడు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, వాకాడ కనకరాజు పాల్గొన్నారు.

## వరి విత్తనాలు సిద్ధం

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట** : రైతులకు అవసరమైన 1000 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్‌రావు శనివారం తెలిపారు. విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 700 క్వింటాళ్ల ఆర్‌జెఎల్ విత్తనాలు, 300 క్వింటాళ్ల సాంబ మసూరి, బీపీటీ 5204, స్వర్ణ, 1064, ఏమ్‌టియు 1318, ఎమ్‌టియు -1224, ఎమ్‌టియు 1262 రకాల విత్తనాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. వరి విత్తనాలు తీసుకున్న రైతులు సొంతంగా మొలక శాతాన్ని పరీక్షించుకోవాలని సూచించారు. విత్తనాల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే మార్పు చేసి విత్తనాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## నారాయణ కళాశాల వద్ద ధర్నా

**ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్** : అనకాపల్లి నారాయణ కళాశాల వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జీ, జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు అక్షరాల పేరుతో వేల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నాయని ఆరోపించారు. రూ.15,000 నుంచి రూ.35,000 వరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పేరుతో వారి కళాశాల/ పాఠశాల పేర్లు ముద్రించి అమ్ముతున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్, ప్రవేట్ విద్యాసంస్థలపై ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు సింహాద్రి, దేవిశ్రీప్రసాద్, సాయితేజ, నాయుడు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఈదురుగాలులతో కుండపోత వర్షం

## నేలకొరిగిన వృక్షాలు
## పోలీసు స్టేషన్‌పై కూలిన చెట్టు

**ప్రజాశక్తి-దేవరాపల్లి**

మండలంలో శనివారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన కుండ పోత వర్షం కురిసింది. ఈ ఈదురుగాలుల ప్రభావంతో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద 6 చెట్లు నేలకొరిగాయి. అందులో ఒక చెట్టు పోలీసు స్టేషన్ భవనంపై పడింది. అయితే ఎటువంటి ప్రమాదం జరగలేదు. గాలికి కూలిపడిన వృక్షాలను ఎస్సై టి.మల్లేశ్వరరావు తన సిబ్బందితో తొలగించారు. మండలంలోని కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు పునరుద్ధరణకు విద్యుత్ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. అలాగే ఈ వర్షాల వల్ల కూరగాయల పొలాలు నీట మునిగాయి. కూరగాయల రైతులు పంటలు పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలు సరుగుడు తోటలు వేయటానికి అనుకూలంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.




పోలీసు స్టేషన్ కూలిన చెట్టు

# ఫీజుల భారం

- బెంబేలెత్తిపోతున్న తల్లిదండ్రులు
- నియంత్రణ చర్యలు శూన్యం
- ప్రభుత్వం దృష్టి సారించాలని వేడుకుంటున్న పేరెంట్స్

**ప్రజాశక్తి, అనకాపల్లి రూరల్**

విద్యాసంవత్సరం ప్రారంభమైంది. పిల్లల స్కూళ్లు, కాలేజీల ఫీజుల భారంతో తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజల్లోనూ ఫీజుల ఆందోళన కనిపిస్తుందంటే అతిశయోక్తి కాదు.

జూన్ నెల రాగానే పాఠశాలలు తెరుచుకొని, పిల్లల అడ్మిషన్లు, పుస్తకాలు, యూనిఫామ్‌ల కొనుగోలు వంటి ఖర్చులు తల్లితండ్రులను ఆర్థికంగా గిలగిలలాడిస్తున్నాయి. ఇప్పటికే పెరిగిన జీవన వ్యయాలకు తోడు ఫీజుల భారంతో ఆర్థిక ఒత్తిడి అధికమవుతోంది. ప్రభుత్వ బడులపై సర్కారు నిర్లక్ష్యంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకుంటూ కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో బేసిక్‌కు మించి వసూలు చేస్తున్నారనేది క్షేత్రస్థాయి మాట. మొదటి తరగతిలో చేరుతున్న చిన్నారుల నుంచే లక్షల రూపాయల ఫీజులు డిమాండ్ చేస్తుండడంతో తల్లిదండ్రులను బెంబేలెత్తిపోతున్నారు. యూనిఫామ్స్, బుక్స్, ట్రాన్స్‌పోర్ట్, యాక్టివిటీ ఫీజుల పేరిట అదనంగా వసూలు చేస్తున్నారు. ఎల్‌కెజి విద్యార్థికి కూడా రూ.20వేలు నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేస్తున్నారంటే ఆశ్చర్యపోవాల్సి వస్తోంది. విద్యను వ్యాపారంగా మలుచుకుంటున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. ఫీజుల నియంత్రణ కోసం సమగ్రమైన విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే, మధ్య తరగతి తల్లిదండ్రులు పిల్లల చదువును భరించలేని పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందనేది తల్లిదండ్రుల మాట.


### ఫీజులు భారంగా ఉన్నాయి



బాగా చదివించాలనే ఆశతో ప్రైవేట్ స్కూల్లో వేస్తున్నాం. అక్కడే పుస్తకాలు కొనాలి. బిల్డింగ్ ఫీజు, నిర్వహణ ఫీజు అంటూ భారీగా ఫీజులు పెంచేస్తుంటే చాలా భారంగా ఉంది. నాలాంటి వారు ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు.

-ఎన్.దుర్గా, విద్యార్థి తండ్రి

### ఫీజులుపై నియంత్రణ ఉండాలి



ప్రభుత్వ బడులు బాగా ఉన్నా ప్రజల్లో నమ్మకం లేక ప్రైవేట్ స్కూల్లోనే వేస్తున్నారు. అక్కడ ఫీజులు నియంత్రణ లేక ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఇది భారమే. ఫీజులపై నియంత్రణ ఉండాలి

- కోటిని రాము, కసింకోట

### ప్రభుత్వ నిర్ణయించిన ఫీజులే వసూలు చేయాలి



ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మాత్రమే ఫీజులు వసూలు చేయాలి. అంతకుమించి చేస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు ఉంటాయి. ఫీజులు తగ్గ ఏర్పాట్లు కూడా పాఠశాలలో కల్పించాలి.

- కోటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి, అనకాపల్లి

## స్నేహితుని కుటుంబానికి సహాయం

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట** : మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. వడ్డాది జెడ్పీ హైస్కూల్లో 2012-13 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఇటీవల సమావేశమయ్యారు. తమతో పాటు చదువుకున్న గొళ్ళోరి సుకుదేవ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని తీవ్ర విచారం వ్యక్తం చేశారు.య పేద గిరిజనుడైన సుకుదేవ్ కుటుంబాన్ని ఆదుకోవాలని తీర్మానించారు. ఈ నేపథ్యంలో శనివారం స్నేహితులంతా ముంచంగిపుట్టు మండలం సరిగంపుట్టు గ్రామానికి వెళ్లి సుఖదేవ్ కుటుంబ సభ్యులకు రూ.22వేలు నగదు, నిత్యావసర సరుకులను అందించి మరణించిన స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు.



ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

# కుమ్మక్కై కొల్లగొడుతున్నారా!

## - కోడూరు సర్వేనెంబర్ 20లో అదే తంతు
## - గందరగోళంగా తహశీల్దార్ వివరణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

ప్రజల సొమ్మును కూటమి నాయకులు, ప్రతిపక్ష నేతలు కుమ్మక్కై కొల్లగొడుతున్నారా? అక్రమ ఆదాయ ఆర్జనలో కలిసికట్టుగా వెళ్తున్నారా? అంటే అవుననే సమాధానం క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతోంది. అనకాపల్లి మండలం కోడూరు సర్వే నెంబర్ 20లో ఎపిఐఐసి భూ సేకరణకు సంబంధించి పరిహార పంపిణీ ప్రక్రియ కూడా దీనికి అద్దం పడుతుంది.

పరిశ్రమల ఏర్పాటు కోసం అంటూ కోడూరులో 200 ఎకరాలు గతంలోనే ఎపిఐఐసి వారు భూసేకరణ చేపట్టారు. రైతుల భూమి అంటూ పరిహారం నొక్కేసేందుకు కొందరు నాయకులు నాడు స్కెచ్ వేశారు. సర్వేనెంబర్ 20లో తాము సాగులో ఉన్నామని, పరిహారం చెల్లించాలని అప్పటిలో రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టారు. అయితే నాటి తహశీల్దారు ఇది ప్రభుత్వ భూమిగా గుర్తించడం, మరో తహశీల్దారు దానిని నిర్ధారించడంతో పరిహారం పంపిణీకి నాడు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు మళ్లీ దానిని చక్రం తిప్పడంతో రెవెన్యూ మాయ చోటుచేసుకుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 6.38 కోట్ల రూపాయలు ప్రభుత్వ భూమికి పరిహారంగా చెల్లింపులో పెద్దల హస్తం ఉందనేది క్షేత్రస్థాయి నాయకుల ఆరోపణ. సరైన ధ్రువీకరణలు లేకపోవడంతో ఎస్‌బిఐ బ్యాంకు కొందరికి పరిహారం చెల్లించేందుకు తిరస్కరించగా, రెవెన్యూ అధికారులు ఓ ప్రైవేట్ బ్యాంకు సహకారంతో ఓ నలుగురు అకౌంట్లోకి లక్షల రూపాయలను వేసేశారు. ఇది పలు అనుమానాలకు తావిస్తోంది.


దీనిపై తహశీల్దారు వివరణ కూడా సరిగా లేకపోవడం అక్రమ ఉదంతానికి నిదర్శనంగా నిలుస్తుంది. పరిహారం పంపిణీలో తమ పాత్ర లేదంటూ అంతా ఆర్డీవో కార్యాలయం నుంచే జరిగిందని తహశీల్దారు పత్రికల ద్వారా ఇచ్చిన వివరణ గందరగోళానికి దారితీస్తోంది. తహశీల్దారు నిర్ధారణ లేకుండానే పరిహార పంపిణీ జరిగిపోయిందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

**కుమ్మక్కైన అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు**

నిజానికి భూముల కబ్జా, క్వారీల దందా వంటివి ప్రస్తుతం నియోజకవర్గంలో బాగా పెరిగాయనే ప్రచారం జోరందుకుంది. దీనిలో కూటమి నాయకులు ప్రతిపక్ష నేతలు కలిసి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసిపి నాయకుల అవినీతి భాగోతం అంటూ ఎన్నికల ముందు టిడిపి, జనసేన నాయకులు నానా యాగీ చేశారు. బయ్యవరం భూములపై రాష్ట్రస్థాయిలోనే ఉద్యమం చేసేంత పని చేశారు. అధికారంలోకి వస్తే వైసిపి నేతల అవినీతి, అక్రమాలపై విచారణ చేయిస్తామంటూ వాగ్దానాలు చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక ఎటువంటి చర్యలు లేకపోవడం వెనుక కుమ్మక్కైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ మాజీ టిడిపి ఎమ్మెల్యే ప్రస్తుత ఎమ్మెల్యేతో పూర్తిస్థాయిలో టచ్‌లో ఉంటూ అక్రమ తంతుకు తెర లేపుతున్నట్లు అధికార పార్టీ కీలక నాయకులే విమర్శించడం గమనార్హం. కోడూరు భూములకు పరిహారం పంపిణీపై విచారణకు టిడిపి మినీ మహానాడులో బహిరంగంగానే డిమాండ్ చేశారంటే ఈ అక్రమ ఉదంతం వెనుక అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల హస్తం ఉందనేది తేటతెల్లమవుతోంది.



ఎపిఐఐసి సేకరించిన భూమి ఇదే..



సిపిఎం నేతలకు ఫ్యాన్ అందిస్తున్న చినరామారావు

## సిపిఎం కార్యాలయానికి ఫ్యాన్ వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయానికి సుందరయ్య పేట గ్రామానికి చెందిన ఈగల చిన రామారావు ఒక ఫ్యాన్ వితరణ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకర్రావు, గంట శ్రీరామ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుగుడి నూక అప్పారావు పాల్గొన్నారు.

## అనుమతుల్లేని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : అనుమతుల్లేని విద్యా సంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎపి జూనియర్ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.జనార్దనరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎస్ఎస్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థ ఇటీవల ఒక అకాడమీ స్థాపించి ఐఐటి, నీట్ పరీక్షలకు శిక్షణ ఇస్తామని చెప్పి జూనియర్ ఇంటర్‌లో అడ్మిషన్లు చేసిందని తెలిపారు. నిబంధనలు పాటించకుండా మండల కేంద్రంలో ఒక ప్రైవేట్ విద్యా సంస్థ సుమారు 100 మందిని ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్‌కు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని చెప్పారు. తక్షణమే అధికారులు దీనిపై విచారణ చేపట్టి ఈ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ అనుమతులు లేని కళాశాలలో విద్యార్థులను చేర్పి మోసపోవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో నవోదయ కాలేజ్ ప్రిన్సిపాల్ బీశెట్టి మురళి ప్రసాద్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు టి మాణిక్యాలరావు, రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ కాలేజీ డైరెక్టర్ పోతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : దళితులకు ఇచ్చిన ఎన్నికల హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చాలని మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం అధ్యక్షులు కాటపల్లి అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద శనివారం జరిగిన సంఘం సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కలిసి మెలిసి ఉన్న ఎస్సీలను వర్గీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. క్రిమీలేయర్ చట్టాన్ని న్యాయపరంగా అడ్డుకొని, తమ పిల్లల భవిష్యత్తును కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కార్లి సాయి సుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బరపు మాలిబాబు, పరవాడ అప్పారావు, కన్నాబత్తుల రాజు, తాడి ఎర్రాబాబు, కడారి రాజు, రొప్పల రాజు పాల్గొన్నారు.

## 25న ప్రజానాట్యమండలి జిల్లా మహాసభ

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రథమ మహాసభ అనకాపల్లిలో ఈ నెల 25న నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పొంతపల్లి రామారావు తెలిపారు. కె.కోటపాడులో ప్రజానాట్యమండలి సభ్యులు ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్య పర్చే కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రజల కోసమే కళలు అనే లక్ష్యాన్ని నిర్దేశం చేసుకొని నిరంతరంగా ప్రజలను జాగృతం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గొర్లె దేవుడుబాబు, రెడ్డి అప్పలనాయుడు, దమ్ము ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

## పాల సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం ఎస్‌బిఆర్ పాలెం పాల సొసైటీకి ఇద్దరు డైరెక్టర్లను సీనియర్ టిడిపి నాయకులు దొడ్డి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో శనివారం పాడి రైతులు ఎన్నుకున్నారు. పాడి రైతులు దొడ్డి సూరిబాబు, దాడి వెంకటి నూతన డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొడ్డి సోమేశ్వరావు, దొడ్డి రాజుకోటి, దొడ్డి ముత్యాలనాయుడు, ఆడారి కోటి, కొంతాల కృష్ణ, కిల్లి సింహాచలం, సూరిశెట్టి రమణ, దొడ్డి రామప్పడు, దాడి సూరిబాబు పాల్గొన్నారు.

# న్యాయవాద వృత్తికి నీతి, నైతికత ముఖ్యం

## ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి



జస్టిస్ రవిని సత్కరిస్తున్న లా వర్సిటీ అధికారులు

ప్రజాశక్తి-సబ్బవరం

న్యాయవాద వృత్తిలో రాణించడానికి నీతి, నైతికత అనేవి చాలా ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి అన్నారు. ఎపి బార్ కౌన్సిల్, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడురోజుల లీగల్ ఓరియెంటేషన్ ముగింపు కార్యక్రమానికి జస్టిస్ రవి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కేరీర్ మీద ఫోకస్‌గా ఉండాలని సూచించారు. న్యాయవాదిగా రాణిలించాలంటే ఎంతో ఓపికను అలవర్చుకోవాలని, సీనియర్ న్యాయవాదులను కలుస్తూ వారి సలహాలు తీసుకొని పని చేస్తే ఏ గాడ్ ఫాథర్స్ అవసరం లేదని, సొంతంగా ఎదగవచ్చని పేర్కొన్నారు. న్యాయవాది ముందుగా చట్టాన్ని పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో లా వర్సిటీ వైస్ ఛాన్సలర్ డి.సూర్యప్రకాష్‌రావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సిరిపురపు కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ ఆలూరి రామిరెడ్డి, ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలిగినీడి చిదంబరం, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.నరసింగరావు, గంటా రామారావు, కీర్తి రామ జోగేశ్వరరావు పాల్గొన్నారు.

## 16న విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం డి2 సెక్షన్, 33/11కెవి అంతకాపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అడిషనల్ బ్రేకర్ (ఆర్‌డిఎస్ఎస్) స్కీమ్ పనుల కారణంగా ఈ నెల 16న సోమవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోధువలస, అయ్యన్నపాలెం, మర్రిపాలెం, అంతకాపల్లి, వంగలి, రాయపురఅగ్రహారం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొట్టివాడ, పెదయతపాలెం, బంగారమ్మపాలెం, అద్దూరు, ఎల్లుపి, లగిశెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రాజా గణేష్ మృతి సాహితీ రంగానికి తీరని లోటు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సాహితీ మిత్రులు బహుగ్రంథకర్త, లక్కోజు రాజాగణేష్ శనివారం తెల్లవారుజామున గాజువాకలోని ఆయన స్వగృహంలో మరణించారు. ఆయన మృతి సాహితీ రంగానికి తీరని లోటని అనకాపల్లి సాహితీమిత్రులు తెలిపారు. మంచి రచయితను, మిత్రుని కోల్పోవటం బాధాకరమని, ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# పలు చోట్ల రక్తదాన శిబిరాలు




రక్తదానం చేస్తున్న గీతం విద్యార్థులు, వాలంటీర్లు

ప్రజాశక్తి-మధురవాడ : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అనుబంధంగా గల జిమ్సర్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గీతం ఆస్పత్రి రక్తనిధి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గీతం వైద్య, నర్సింగ్, పారామెడికల్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతోపాటు ఐఎన్ఎస్ కళింగ నుంచి నేవి అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిమ్సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, జిమ్సర్ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి డాక్టర్ అంజు చౌదరి, జిమ్సర్ అక్రిడిటేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణకార్తీక్ భోగవల్లి, జిమ్సర్ సూపరింటెండెంట్ డాక్టర్ వివి.నరసింహరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమణరావు పాల్గొన్నారు.

**అనకాపల్లి :** ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ బ్లడ్ బాంక్, సర్వేజనా ఐక్యవేదిక అధ్యక్షులు కోరిబిల్లి పరి ఆధ్వర్యంలో స్థానిక విజయ రెసిడెన్సిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమని తెలిపారు. అనంతరం రక్తం దానం చేసిన వారిని అభినందించి సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం :** మండలంలోని హరిపాలెం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో 25 మంది యువకులు రక్తదానం చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కర్రి ఆది నాగేశ్వరరావు, కసిరెడ్డి అప్పలనాయుడు, రామారావు పట్నాయక్, ఎం సూర్యనారాయణ, కాంగ్రేసుల వెంకట అప్పారావు పాల్గొన్నారు.



అనకాపల్లిలో రక్తదానం చేస్తున్న దృశ్యం

# బిఎన్ రోడ్డు మరమ్మతు చేపట్టాలి

## - సిపిఎం ఆధ్వర్యాన నిరసన



రోడ్డుపై నిరసన చేపడుతున్న సిపిఎం నేతలు

**ప్రజాశక్తి - రావికమతం:**చోడవరం నుండి నర్సీపట్నం బిఎన్ రోడ్డు పూర్తిగా శిధిలావస్థకు చేరుకొని, చెరువులను తలపించే విధంగా మారిందని, తక్షణమే మరమ్మతు చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో కొత్తకోట బిఎన్ రోడ్డుపై రెండు చేతులు జోడించి మోకాలు పై నిల్చొని వినూత్నంగా ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు మాట్లాడుతూ, ఈ రోడ్డు గత 11 ఏళ్ల నుంచి వడ్డాది నుంచి నర్సీపట్నం వరకు రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారిందన్నారు. వడ్డాది, విజయరామరాజుపేట బ్రిడ్జిలు కూలిపోయి ఏండ్లు గడుస్తున్నప్పటికీ వాటినీ పట్టించుకునే నాధులు కరువయ్యారన్నారు. తక్షణమే ఈ రోడ్డును, రెండు బ్రిడ్జిలు నిర్మాణాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేసే అనేకమంది పాదచారులు, వాహన చోధకులు పలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న వారిని, గర్భిణీలు ఈ రోడ్డు గుండా పలు రకాల పనుల నిమిత్తం ప్రయాణం చేయాలంటే నరకం చూడాల్సిందేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్, ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ రాజు గత ఏడాది ఎన్నికల్లో గెలిచిన వెంటనే బిఎన్ రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని, సంవత్సరం పూర్తయినా వేసిన గొంగళి అక్కడ అన్న చందాగా కనీసం పిడికెడు మట్టి కూడా ఎక్కడ వేయలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యోగా పేరుతో సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు అని ఆయన దుయ్యబట్టారు.. స్కూలు పిల్లలకు బస్సులు సమయానికి రాకపోవడంతో, పాఠశాలకు కూడా సమయానికి చేరుకోలేకపోతున్నారన్నారు..కూటమి ప్రభుత్వం ఎంపీ, ఎమ్మెల్యేలు తక్షణమే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టకపోతే భారీ ఎత్తున ఆందోళన చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల నాయకులు గేమిల వాసు, సింగారపు వలసయ్య, నాయకులు పి.చిరంజీవి పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి-మధురవాడ :** స్థానిక పిఎం.పాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి లైను మరమ్మతులు, విద్యుత్‌వైర్లను తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు వంటినిర్వహణ పనుల నేపథ్యంలో ఈనెల 16న సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ ఆపరేషన్స్ విభాగం ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. పిఎం పాలెం లాస్ట్ బస్‌స్టాప్, సిద్దార్థనగర్, బాబా కాలేజీ రోడ్డు, షిప్‌యార్డ్ లేఔట్, బబేలమ్మ గుడి వెనక వీధి, మాలతాంబ స్కూలు, ఓల్డ్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, మీ సేవా, సాంకేతిక కాలేజీ, హౌసింగ్ బోర్డు, ఆశ్రమం లేఔట్, స్టేడియం బి గ్రౌండ్, వి కన్వెన్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలని కోరారు.

## పూర్వ విద్యార్థుల ఔదార్యం

### రూ.30 వేల ఆర్థిక సహాయం


నగదును ఇస్తున్న పూర్వ విద్యార్థులు

**ప్రజాశక్తి-గొలుగొండ:**తమతో పాటు చదువుకొని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్ననాటి స్నేహితులకు ఆర్థిక సహాయం అందించి ఏ కష్టం వచ్చినా తామున్నామని పూర్వపు విద్యార్థులు మానవత్వాన్ని చాటుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ప్రభుత్వ జడ్పీ హైస్కూల్లో 1994-95 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు తమతో పాటు చదివిన పాత కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన కయ్యం శ్రీలక్ష్మి, కృష్ణదేవిపేటకు చెందిన పైల అప్పలనాయుడు, అనపర్తికి చెందిన జి.రవిబాబులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి(పోలీస్), అలివేణి మంగ, రాణి, దేవుడమ్మ, మాట్లాడుతూ తమతో పాటు చదువుకున్న చిన్ననాటి స్నేహితులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకొని ఇటీవల నర్సీపట్నం వివేకనంద కళాశాలలో నిర్వహించిన పూర్వపు విద్యార్థుల సమ్మేళనంలో వారందరికీ ఆర్థిక సహాయం అందించాలని సంకల్పించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగానే పూర్వపు స్నేహితులందరూ కలసి సేకరించిన నగదును తమ స్నేహితులకు అందజేయడం జరిగిందన్నారు. తమ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి తమకు ఆర్థిక సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు.

## ప్రతి రోజూ యోగా చేయాలి



నక్కపల్లిలో ఆసనాలు వేస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలంలోని కొత్తఎల్లవరం పాఠశాల మైదానంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మేరీరోజ్ పర్యవేక్షణలో సర్పంచ్ కొల్లు రాంబాబు, సచివాలయ సిబ్బంది, పలువురు నాయకులు యోగసనాలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా మన జీవితంలో ఒక భాగం కావాలన్నారు.

**కోటవురట్ల:**యోగాను ప్రతి ఒక్కరు జీవితంలో భాగంగా చేసుకుని నిత్యం ఆసనాలు వేయాలని తహసిల్దార్ తిరుమల బాబు అన్నారు, శనివారం ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో బికే.పల్లి గ్రామంలో సచివాలయం వద్ద ఉద్యోగులతో యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు, డిప్యూటీ ఎంపీడీవో రఘురాం ఆసనాలు వేశారు.

**అనకాపల్లి :** ఉద్యోగులు ప్రతి రోజు యోగా చేయడం వల్ల వారి ఆరోగ్యంగా జీవించవచ్చని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వై.సత్యనారాయణ రావు, జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ కె లావణ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.మనోరమ, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్‌వి రమణ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా విభిన్న ప్రతిభావంతుల హిజ్రాలు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ జి.అన్నపూర్ణ అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా జిల్లాలోని వికలాంగుల సంఘాల ప్రతినిధులతో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో యోగ గురువు గంగూరు మంగయ్య సూచనలతో యోగాసనాలు వేయించారు.

**కె.కోటపాడు :** మండలంలోని చౌడువాడలో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో యోగ నిర్వహించారు. డిప్యూటీ తహసిల్దార్ రమేష్ బాబు అన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

**దేవరాపల్లి :** మండలంలోని మామిడిపల్లిలో జడ్పీటీసీ కర్రి సత్యం, తహసీల్దారు పి.లక్ష్మీదేవి, ఎంపీడీఓ ఎంవి.సువర్ణరాజు, పరిపాలనాధికారి డి.వి.లక్ష్మీనారాయణ, ఈవోపీఆర్డి అనంత ఉమాదేవి యోగాసనాలు వేశారు.

**నక్కపల్లి :**మండలంలో అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం యోగాంధ్ర ప్రోటోకాల్ ఆసనాల డెమో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో డీ సీతారామరాజు, తహసీల్దార్ నరసింహమూర్తి, వేంపాడు ఆయుష్ వైద్యాధికారి రఘు ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు దవరసింగి రాంబాబు, డీ ఎన్ వీ సాయి, సీడీపీవో శ్రీ విద్య, సూపర్ వైజర్లు లలిత, సత్యవతి, ఆర్ఐ శ్రీపాద ప్రసాద్ పాల్గొన్నారు.

**ఆనందపురం:** యోగాంధ్రలో భాగంగా మండలంలో అన్ని సచివాలయాలు, ఇతర కార్యాలయాల్లో 144 వేదికలు గుర్తించి, శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు మాస్ యోగా ప్రదర్శనలు నిర్వహించారు. ఒక్కో వేదికలో 100 మంది ప్రజలు పాల్గొని యోగాసనాలపై శిక్షణ పొందారు.ఎంపిడిఒ డాక్టర్ వి. జానకి డిప్యూటీ ఎంపిడిఇఒ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**పద్మనాభం :** యోగాంధ్రలో భాగంగా మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో శనివారం మాస్ యోగా ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిడిఒ ఎం.విజయకుమార్ సూచనలతో పాఠశాల ప్రాంగణాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు.

**మధురవాడ:** యోగాంధ్రను విజయవంతం చేయడం ద్వారా విశాఖ ప్రతిష్టను విశ్వవ్యాపితం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 21న యోగాంధ్ర ఏర్పాట్లపై పీఎం పాలెం వి కన్వెన్షన్ హాల్లో సమీక్షించారు. జనసేన భీమిలి ఇంచార్జ్ పంచకర్ల సందీప్, ఆర్డీఓ కె సంగీత్ మాధుర్, యూసీడీ పీడీ సత్యవాణి, కె. జ్ఞానవేణి, హౌసింగ్ పీడీ సత్తిబాబు పాల్గొన్నారు.

**విశాఖ కలెక్టరేట్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న నగరంలో ప్రధానమంత్రి నరేంద్రమోడి పాల్గొనే యోగా కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. నగరంలోని కేంద్ర ప్రభుత్వ, పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో యోగాంధ్రపై కలెక్టర్ శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. యోగా కార్యక్రమంలో పాల్గొనదలచిన వారికి సమాచారం కోసం ఈ హెల్ప్ డెస్కకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చున్నారు. 0891-2942015, 2942040, 2942044, 2942055 ల్యాండ్ లైన్ నెంబర్లకు ఫోన్ చేస్తే సమాచారం అందజేస్తారని పేర్కొన్నారు.

**ఎంవిపి.కాలనీ:** విశాఖపట్నం రామకష్ణ బీచ్ నుండి భీమిలి వరకు ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అందులో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్లను విశాఖపట్నం ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు శనివారం మద్దిలపాలెం బస్‌స్టేషన్లో అతికించారు. డిపో మేనేజర్ అరుణకుమారి, మద్దిలపాలెం స్టేషన్ యూనిట్ ఇన్‌చార్జి మూర్తి, సూపర్‌వైజర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.


పాలాభిషేకం చేస్తున్న నాయకులు, మహిళలు

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాశక్తి -కోటవురట్ల:**కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమల్లో భాగంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిన సందర్భంగా కైలాస పట్నం గ్రామంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హెూం మంత్రి అనిత చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు మాణిక్యాలరావు మాట్లాడుతూ, పేద విద్యార్థుల చదువు భారం కాకూడదని ఉద్దేశంతో ఎన్నికల హామీల ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సుంకర బాబ్జి, పాయకరావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ పురం పాప, పలువురు లబ్ధిదారులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల వ్యవసాయాధికారిగా చిరంజీవి



**ప్రజాశక్తి-రోలుగుంట:**రోలుగుంట మండల వ్యవసాయాధికారిగా సిహెచ్.చిరంజీవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆరు సంవత్సరాలుగా మాకవర పాలెం మండల వ్యవసాయాధికారిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ మండలంలోని రైతులకు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటానన్నారు.


మాట్లాడుతున్న ఆసుపత్రి ప్రతినిధులు

## వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-రావికమతం:**అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తున్న అనేక రకాల వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి అన్నారు.ఈ సందర్భంగా శనివారం కవగుంట గ్రామ ఉపాధి శ్రామికులతో అనిల్ నీరుకొండ ఆసుపత్రి ప్రతినిధులు సమావేశమై ఆరోగ్యపరమైన పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, అనిల్ నీరుకొండ ఆసుపత్రి బస్సులో ఆసుపత్రికి అనారోగ్యంతో బాధపడుతున్న రోగులందరిని తీసుకువెళ్లి, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారన్నారు. అనేక రకాల వైద్య పరీక్షలు,ఆపరేషన్లు, స్కానింగ్‌తో పాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తారన్నారు. అదేవిధంగా ఆసుపత్రికి వెళ్ళిన వారందరికీ మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్ నీరుకొండ ప్రతినిధి ప్రతాప్, వి.నాగరాజు, కె .రాము తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక శాఖ భూముల పరిశీలన

**ప్రజాశక్తి -తగరపువలస :** భీమిలి మండలం అన్న వరం గ్రామంలో పర్యాటక శాఖకు కేటాయించిన పలు ప్రభుత్వ భూములను ఆర్‌డిఒ సంగీత్ మాధుర్, తహశీల్దార్ పైలా రామారావుతో కలిసి శనివారం పర్యాటక శాఖ జిల్లా అధికారులు పరిశీలించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, మహిళలు

## గంజాయి నిర్మూలనపై ర్యాలీ

**ప్రజాశక్తి-గొలుగొండ:**నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు, గొలుగొండ ఎస్సై రామారావు, పోలీస్ సిబ్బంది గొలుగొండ మండలం పల్లావూరు నుండి పాతకృష్ణదేవిపేట గ్రామాల్లో గంజాయి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి సేవించడం, గంజాయి అక్రమ రవాణాలో పాల్గొనడంతో కేసులు నమోదై జైలుకు వెళతారన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. గంజాయి రవాణాలో పాల్గొంటున్న వారిపై పీడీ యాక్ట్ కూడా పెట్టి ఆస్తులు జప్తు చేయడం అవుతుందని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.


పనులు పరిశీలిస్తున్న నాయకులు

## సాగునీటి కాలువ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి- పాయకరావుపేట:** ఇటీవల జరిగిన సాగునీటి ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం శనివారం నక్కపల్లి మండలం ఉద్దండపురంలో సాగునీటి కాలువ పనులను ప్రారంభించామని జనసేన పార్టీ రాష్ట్ర జనసేన సీనియర్ నాయకులు, పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇంఛార్జి గెడ్డం బుజ్జి తెలిపారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాగునీటి కాలువ చైర్మన్ గెడ్డం చైతన్య, గెడ్డం కన్నబాబు, పాయకరావుపేట జనసేన నాయకులు తోట నగేష్ , మండల అధ్యక్షులు యగదాసు నానాజీ, నక్కపల్లి మండల అధ్యక్షులు వెలగా సుధాకర్, ఉప అధ్యక్షులు నల్లల రత్నజీ, పాయకరావుపేట టౌన్ అధ్యక్షులు ఆచంట దొర, టిడిపి టౌన్ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు, మండల అధ్యక్షులు చించలపు ప్రదీప్ (పద్దు) , పాయకరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ , టిడిపి మాజీ మండలం అధ్యక్షులు దేవవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునికి ఘన సత్కారం

**ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:** మండలంలోని అత్యంత మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం గ్రామపంచాయతీ పరిధి కర్ల పొదోర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుదీర్ఘకాలం పాంగి లైకోన్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీల కావడంతో గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్, మాతృభాష విద్య వాలంటరీ, విద్యా కమిటీ చైర్మన్ శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాధ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడిగా అనేక సేవలు అందించి విద్యార్థులకు సంపూర్ణమైన విద్యాబోధన అందించారన్నారు.

# ఫార్మా ప్రమాదాలు.. భయాందోళనలు

**ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి**

జిల్లాలోని ఫార్మా కంపెనీల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో కార్మికులు, ప్రజల్లో భయాందోళన నెలకొంది. తరచూ పరిశ్రమల్లో ప్రమాదాలు చోటుచేసుకోవడానికి, మరణాలు సంభవించడానికి, పనిచేయడానికి వీల్లేని వైకల్యంతో జీవితాంతం కార్మికులు, ఉద్యోగులు బాధపడ్డానికి పారిశ్రామిక, కార్పొరేట్ సంస్థల అనుకూల విధానాలను ప్రభుత్వాలు అనైతికంగా అమలుచేయడమే కారణం. పారిశ్రామికాభివృద్ధి పేరుతో పరిశ్రమలను తనిఖీచేసే అధికారం కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల తనిఖీ విభాగానికి లేకుండా సర్కారు చేతులు కట్టేసింది. ఏ పరిశ్రమను ఎప్పుడు, ఎవరు తనిఖీ చేయాలో రాష్ట్ర కేంద్రం చేతుల్లో అధికారం పెట్టుకొనేలా చేసింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో జరిగిన తప్పిదాలు, ప్రమాదాలు, మరణాలు చాలవన్నట్లు పారిశ్రామికవేత్తలకు మరింత సేవ చేసేందుకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అమలుచేసి కార్మికులకు కనీస ప్రాథమిక హక్కులు లేకుండా చేయబూనుకుంది.




ఈ పరంపరలో తనిఖీలు చేసే అధికారంలేని ప్రభుత్వ వ్యవస్థలను పరిశ్రమాధిపత్యం పట్టించుకోవడం మానేశారు. రక్షణ, భద్రతా ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పరవాడ ఫార్మాలోని సాయి శ్రేయాస్ మందుల కంపెనీలో ఇద్దరు సేఫ్టీ అధికారుల మృతి యాజమాన్య నిర్లక్ష్యంలో భాగంగానే చూడాలి. ప్రమాద ప్రదేశంలో ప్రమాదాలను గుర్తించి హెచ్చరించే డిటెక్టర్ల వ్యవస్థను ఏర్పాటుచేస్తే ప్రమాద తీవ్రత తగ్గడానికి అవకాశం వుంటుంది. కానీ అందుకు యాజమాన్యాలు సిద్ధంగాలేవు. పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వాలని ప్రభుత్వమూ ఒత్తిడి చేయడం లేదు. ప్రమాద తీవ్రత ఎక్కువగా వున్నప్పుడు కార్మికవర్గం నుంచి నిరసనలు, ఆందోళనలు లేకుండా మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించి తమ తప్పిదం నుంచి బయటపడాలని యాజమాన్యాలు చూస్తున్నాయి. ఫార్మా ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలి. ప్రమాద నివారణ చర్యలు చేపట్టేలా ఒత్తిడి పెంచాలి. ప్రమాదం తనవరకూ రాకముందే అప్రమత్తంకావాలి. కార్మికులు సంఘటితమై పని ప్రదేశంలో రక్షణ, భద్రత ప్రమాణాలు పాటించేలా, కార్మిక చట్టాలు అమలుజరిగేలా, ఉద్యోగ భద్రత లభించేలా పోరాడాలి. పోరాటంలో తుది విజయం సాధించే వరకూ కార్మిక సంఘాల నేతృత్వంలో కలిసి నడిచి ప్రభుత్వ కపట నీతిని, యాజమాన్య మోసాలను ఎండగట్టాలి.

# ఉత్సాహంగా సిఐటియు జోన్ మహాసభ

**ప్రజాశక్తి- విశాఖపట్నం :** సిఐటియు కంచరపాలెం జోన్ మహాసభ శనివారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కంచరపాలెం సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో

జోన్ నూతన అధ్యక్షులుగా ఎస్ శ్రావణ్‌కుమార్, జనరల్ సెక్రెటరీగా అప్పారావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులపై దాడిని ఖండిస్తూ, తొలగించిన నాలుగు వేల మందిని విధుల్లోకి తీసుకోవాలని, ఆప్కాస్ రద్దు, కనీసవేతనం రూ.26వేలు అమలు, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు, స్కీం వర్కర్లు అందరికీ తల్లికి వందనం అమలు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత 44 కార్మిక చట్టాల పునరుద్ధరణ, పనిగంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, ఎనిమిది గంటల విధాన కొనసాగించాలని, కార్మికుల పని గంటలను 8 గంటల నుండి 12 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, రైల్వే కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఇలా పలు తీర్మానాలు చేశారు.

యోగా పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న హంగు ఆర్భాటాలను ఖండిస్తూ ఈనెల 20వరకు నిరసనలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ ఏడాది చివర్లో నిర్వహించే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని తీర్మానించారు. తీర్మానాల అమలుకు ఐక్యఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాలని నేతలు పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, జిల్లా కార్యదర్శి బి జగన్, జిల్లా కోశాధికారి ఎస్ జ్యోతీశ్వరరావు మాట్లాడారు. సిఐటియు జోన్ కమిటీ ట్రెజరర్‌గా ఎన్




ప్రకాశరావు,ఉపాధ్యక్షులుగా బి సింహాచలం, ఎం ఈశ్వరరావు, పి మూర్తి, జాయింట్ సెక్రటరీగా వి బాబ్జీరావు, జి శ్రీనివాసరావు, వి సీత లక్ష్మి, కమిటీ సభ్యులుగా వి ఎర్రినాయుడు, రాంబాబు, కోన వెంకట్రావు, డి.ప్రకాష్, ఎన్ మోహనరావు, వి మహేశ్వరి, బి అప్పారావు, బమ్మిడి అప్పారావు, సాధురావులను ఎన్నుకున్నారు.


ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న

## కోదండరామ కల్యాణ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**ప్రజాశక్తి-గొలుగొండ:**మండలం లోని జానకిరాంపురం గ్రామంలో కొలువై ఉన్న కోదండరామ స్వామి వారి 4వ వార్షికోత్సవ కళ్యాణ ఆహ్వాన పత్రికను శనివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుతుకు ఆవిష్కరించారు.ఈ నెల 18న కళ్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈనెల 17 ఉదయం 8 గంటలకు కళ్యాణమూర్తులను అలంకరించి గ్రామోత్సవం నిర్వహిస్తారని, 18న కోదండరామస్వామి కళ్యాణం ఆలయ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ప్రారంభించినట్లు తెలిపారు. 19 గురువారం ఉదయం స్వామివారికి పంచామృత స్నానం, సాయంత్రం 6 గంటలకు శ్రీపుష్పయాగం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్న దంపతులు, విజయ్, రాజేష్ దంపతులు హాజరు కావాలని కోరామని కమిటీ సభ్యులు తెలిపారు.

# మన్యంలో భారీ వర్షం

## -చింతపల్లిలో పిడుగుపాటుకు గొర్రెలు, దుక్కిటెద్దు మృతి

**ప్రజాశక్తి-చింతపల్లి:-** ఉరుముల, మెరుపులతో కూడిన భారీ వర్షం కారణంగా జున్నుల గ్రామంలో పిడుగుపాటుకు ఐదు గొర్రెలు, ఒక దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని జున్నుల గ్రామ సమీపంలో శుక్రవారం మేత కోసం తీసుకెళ్లిన పశువులు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి గురయ్యాయి. ఈ సమయంలో పిడుగు పడటంతో గ్రామానికి చెందిన గిరిజన రైతు రాజారావుకు చెందిన ఐదు గొర్రెలు, ఒక దుక్కిటెద్దు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ఘటనపై బాధితుడు రాజారావు స్పందిస్తూ, వీటి మృతితో తనకు సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరారు.


చింతపల్లిలో మృతి చెందిన మూగజీవాలు

**సీలేరు** : జికె వీధి మండలం సీలేరులో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

## కోర్టు ఆదేశాలతో రోడ్డు విస్తరణ చేపట్టాలి

**ప్రజాశక్తి -పాడేరు :-** అల్లూరి జిల్లా 5వ షెడ్యూల్ ప్రాంతంలోని పలు ప్రధాన కేంద్రాల్లో రోడ్డు విస్తరణ కోసం రోడ్డుకిరువైపులు 50 అడుగుల చొప్పున ఆక్రమణలు తొలగించి 100 అడుగులు వెడల్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జారీ చేసిన ఆదేశాలు అమలు చేయాలన్నారు.100 అడుగులు రోడ్డు విస్తరణ పనులు ఆగకుండా జరగాలని పాడేరు కేంద్రంలో శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు నాయకులు, పలు ప్రజా సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైఠాయింపు జరిపారు. ఆయనతోపాటు పలు ప్రజా సంఘాల నాయకులు వైసిపి నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, గిరిజన ప్రాంత వాసులు జిల్లా కేంద్రంతో పాటు మరియు ప్రధాన కేంద్రాల్లో రహదారుల అభివృద్ధి కోరుకుంటున్నారన్నారు, అదే మాదిరిగా ఇరువైపులు రోడ్డు వెడల్పు చేస్తే భవిష్యత్ తరాలకు ట్రాపిక్ మరియు అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ఉంటుందని అన్నారు, కూటమి నాయకులు ఎన్ని ఒత్తిళ్ల గురిచేసిన కోర్టు ఆదేశాల మేరకు రోడ్డు విస్తరణ పనులు యధావిధిగా జరగాలన్నారు, లేదంటే దీనిపై మరింత పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించి ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.